క్లుప్తంగా

మరిడమ్మకు రూ.6.97 లక్షల ఆదాయం



హుండీల సొమ్ము లెక్కిస్తున్న ఆసాదులు, భక్తులు

పెద్దాపురం: మరిడమ్మ తల్లి ఆలయానికి 180 రోజులకు హుండీల ద్వారా సుమారు 6,07,435 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఇంటింటికీ రేషన్



పట్టణంలో రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

పెద్దాపురం: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికీ రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా సివిల్ సప్లయి అధికారి ఎంవీ ప్రసాదరావు అన్నారు. పట్టణంలో ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా అవుతున్న రేషన్ పంపిణీని గురువారం ఆయన ఎంఎస్‌ఓ విజయకుమారితో కలిసి పరిశీలించారు. అనంతరం సాంకేతికంగా తలెత్తుతున్న ఇబ్బందులను నివృత్తి చేసుకుంటూ రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రసాదరావు అన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిరుపయోగంగా జనరేటర్



కొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ జనరేటర్ నిరుపయోగంగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో కరెంట్ లేనప్పుడు వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించేందుకు గాను 2010-2011లో రూ.లక్షకు పైగా వెచ్చించి విద్యుత్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ కొరవడంతో కొన్నేళ్ల క్రితం ఇది మూలన పడింది. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు గురువారం ఉచిత కంటి పరీక్షలు చేశారు. సంకురాత్రి ఫౌండేషన్, కిరణ్ నేత్ర వైద్య సంస్థ ఆధ్వర్యంలో 500 మందికి కంటి పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ, ప్రోగ్రామ్ మేనేజర్ శివగణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు తగదు

పెద్దాపురం: తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న ఆశ వర్కర్లపై అక్రమ అరెస్టు తగదంటూ మున్సిపల్ సెంటర్‌లో గురువారం సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. నాయకులు డి.క్రాంతికుమార్, ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి రూ.6,10,905 ఆదాయం

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీదారు జీఎస్ వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల తదితరుల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఐదు నెలల పది రోజులకు రూ.6,10,905 ఆదాయం సమకూరినట్టు ఈఓ జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు.



తంటికొండ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

సొంతిల్లే తరువాయి..

- చురుకుగా పట్టాల రిజిస్ట్రేషన్
- ఆనందంలో లబ్ధిదారులు



రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన డాక్యుమెంట్లు



సామర్లకోట మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

సామర్లకోట: నవరత్న పథకాల్లో భాగంగా అందరికీ ఇళ్లు అనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో 5464 మందికి ఈటీసీ లే అవుట్, ఉప్పువారి సత్రం, ప్రత్తిపాడు రోడ్డు, గణేష్‌కాలనీ, రాజీవ్ గృహకల్ప, భీమవరం, వేట్లపాలెం జీవీకే పవర్ ప్లాంట్ వద్ద ఉన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మండల పరిధిలో 8,433 మందికి పట్టాలు మంజూరు చేశారు. లబ్ధిదారునికి ఆస్తిహక్కు కలిగేలా రిజిస్ట్రేషన్లు చేసే బాధ్యతను సచివాలయ అడ్మిన్లకు అప్పగించారు. ఈ ప్రక్రియపై సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది, లేఖరులు, టెక్నికల్ సిబ్బందితో శిక్షణ ఇచ్చారు. అలాగే లబ్ధిదారుల పేర్లు, ఆధార్‌కార్డు నెంబరు, వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల వేలి ముద్రలతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

కార్యాలయాలకు చేరుకున్న బాండ్లు

రిజిస్ట్రేషన్ బ్యాండ్లు ఇప్పటికే ఆయా కార్యాలయాలకు చేరుకున్నాయి. ఆయా బాండ్లపై పట్టాల వివరాలు ప్రింట్ చేసిన వెంటనే పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం లబ్ధిదారులు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్, తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్



ఎంతో కాలంగా ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తున్న తమకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల స్థలాలను ఇచ్చారు. ఆ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ పత్రాలతో రుణం పొందవచ్చని బ్యాంకు అధికారుల చెప్పున్నారు.

– మసిముక్కల రామలక్ష్మి, వీకే రాయపురం

లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్లు



ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తాం. ప్రతి సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్నాం. రిజిస్ట్రేషన్లపై ఉన్న అనుమానాలను తమ సిబ్బంది తీరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపుగా 100 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తాం.

– జి.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

బాధితులకు పరిహారం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కొండముచ్చుల దాడిలో గాయపడిన బాధితులకు పరిహారం ఇవ్వడానికి చర్యలు తీసుకున్నట్టు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు తెలిపారు. వన్య ప్రాణి చట్టం ప్రకారం బాధితులకు నష్ట పరిహారం ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణికి సూచించారన్నారు. ఈ మేరకు ఆయన రాజమహేంద్రవరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇప్పటికే అటవీ శాఖాధికారులు చేబ్రోలులో కొండముచ్చుల సంచారాన్ని నిర్ధారించారని, వాటిని పట్టుకుని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వజ్రకూటం అటవీ ప్రాంతంలో వదిలి పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొండముచ్చులను పట్టుకోవడానికి స్థానికుల సహకారం తీసుకుంటామన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన చేబ్రోలు కర్రివారి వీధికి చెందిన చేదులూరి సత్యవేణి నుంచి అటవీ శాఖ అధికారులు వివరాలు సేకరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొత్తపల్లి: గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎన్నికల సెక్టోరియల్ అధికారి జోగిరాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, తదితర అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట కొత్తపల్లి గ్రామ రెవెన్యూ అధికారి కామేశ్వరరావు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో 22వ ద్వావింశ బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతి పూజ, కలశ స్థాపన, దత్తాత్రేయ స్వామికి క్షీరాభిషేకం, దత్తాత్రేయ మాలమంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాత సేవలో వ్యవసాయ విద్యార్థులు



రైస్‌మిల్లు సందర్శనకు వచ్చిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు

పెద్దాపురం: రైతులకు వ్యవసాయ సూచనలు ఇచ్చేందుకు కళాశాల విద్యార్థులు అందుబాటులో ఉండాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. పట్టణంలో శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీలో గురువారం రైస్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు వివరించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయక్ మాట్లాడుతూ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు నాలుగు నెలల పాటు రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. సాగుకు సంబంధించిన మెలకువలను రైతుల వద్ద నుంచి నేర్చుకోవాడమే గాకుండా వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. శాస్త్రవేత్త నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేయస్తున్నట్టు తెలిపారు.

జగన్‌తో ప్రతి ఇంటికీ మేలు

- నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కు అందజేసిన దొరబాబు

సామర్లకోట: ప్రతి ఇంటికీ మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం మాధవపట్నం గ్రామంలో నిర్వహించిన ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా ప్రగతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. దీనిలో భాగంగానే ప్రజలకు మేలు జరిగిందంటనే తనకు ఓటు వేయాలని ఆయన ధైర్యంగా చెప్పున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా అందేలా కొత్త ఒరవడిని సీఎం సృష్టించారన్నారు. గత టీడీపీ పాలనలో ఉన్న నిధులే రాష్ట్రంలో ఉన్నాయని, అయితే అప్పుడు ఈ పథకాలు ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. కడుపులో ఉన్న బిడ్డ నుంచి అవ్వా తాతల వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మహిళలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్‌రెడ్డిని జీవిత కాలం ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం ప్రయత్నించినా లభించలేదని, స్థానిక అభ్యర్థిగా పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని దొరబాబు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మెచ్చుకునే విధం గా ప్రజలకు సేవలు చేస్తానని దొరబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందజేశారు. మండల పరిధిలో 1645 సంఘాలకు రూ.12.30 కోట్లు మంజూరైనట్టు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం వి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. మహిళా సంఘాల సభ్యులు దొరబాబును ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణసత్యా రెడ్డి, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జున రావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కార్యదర్శి మేడిశెట్టి బుజ్జి, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి



అమీనాబాదులో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద అక్రమ కట్టడం

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లను పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో రహదారి మరింత ఇరుకుగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలోని పలు ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎస్, ఎల్ ఆకారంలో మలుపులు ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అమీనాబాదు సెంటర్ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలోని ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని, మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా మన్యం



మన్యం చంద్రరావును అభినందించిన దవులూరి దొరబాబు



చంద్రరావును అభినందించిన చైర్ పర్సన్, కౌన్సిలర్లు, కమిషనర్

సామర్లకోట: మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా మన్యం చంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన గురువారం మున్సిపల్ ప్రత్యేక సమావేశం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు, నాలుగు పర్యాయాలు మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసిన చంద్రరావు సామర్లకోటలో జగనన్న కాలనీ ప్రారంభానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన విషయం తెలిసిందే. దాంతో ఆయనకు మున్సిపాలిటీలో కో ఆప్షన్ పదవి ఇవ్వాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు నిర్ణయించారు. ఇప్పటి వరకు కోఆప్షన్ సభ్యునిగా పని చేసిన దవులూరి సుబ్బారావు ఆ పదవికి రాజీనామా చేయడంతో గురువారం స్థానాన్ని చంద్రరావుతో భర్తీ చేశారు. ఆ పదవికి చంద్రరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేసినట్టు కమిషనర్ జె.రామారావు తెలిపారు. చంద్రరావును కోఆప్షన్ సభ్యుడిగా వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ప్రతిపాదించగా మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ రామారావు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు చంద్రరావును సత్కరించారు.

అనంతరం చంద్రరావు స్థానిక క్యాంపు కార్యాలయంలో దవులూరిని కలుసుకోగా ఆయన అభినందించి, పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, అధికార పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



ఏవీ నగరం పీహెచ్‌సీలో గర్భిణితో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

తొండంగి: గర్భిణులకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా అవగాహన కల్పించేందుకు గాను అడ్వాన్సింగ్ రెడక్షన్ ఇన్ మోర్టాలిటీ, మోర్బిడిటీ ఆఫ్ మదర్స్, చిల్డ్రన్ నియోనేట్స్ (ఆర్మన్) బృందం గురువారం మండలంలోని ఏవీ నగరం పీహెచ్‌సీని పరిశీలించింది. భారతీయ వైద్య విధాన మండలి ఆదేశాల మేరకు డాక్టర్ అనుదీప్తి ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు ఆస్పత్రిలో గర్భిణులకు అందుతున్న సేవలు, హైరిస్క్ కేసులు రికార్డులను పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు పి.భారతి వివరించారు. గర్భిణులు ప్రసవానికి ముందు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర బృంద సభ్యులు వివరించారు. గ్రామాల్లో ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల పరిశీలన



కొత్తపల్లిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాస్

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. కొత్తపల్లి గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4814 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయవలసి ఉందన్నారు. లబ్ధిదారులు పొన్నాడ సచివాలయానికి రిజిస్ట్రేషన్ కోసం రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు తెలిపారు.

భలే మంచురోజు



సామర్లకోట జగనన్న కాలనీ వద్ద పొగ మంచు

పెద్దాపురం: వేకువ జాము నుంచి కురుస్తున్న పొగ మంచుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం 8.30 గంటల వరకు పట్టణ, మండలంలోని అన్ని గ్రామాల్లో పొగమంచు పేరుకునే ఉంది. చలి పెద్దగా లేనప్పటికీ గ్రామాలన్నీ మంచు కప్పి ఉండడంతో ఉదయాన్నే విధులకు, స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే వారు పొగమంచులోనే ప్రయాణం చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తుపట్టలేక ప్రధాన రహదారిపై నెమ్మదిగానే ప్రయాణించారు. శీతాకాలంలో ఇంత మంచు పేరుకపోవడం ఇదే ప్రథమం.

సామర్లకోట: ఈ పొగమంచు వల్ల మంచు వల్ల మామిడి పూత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఉదయం ఎంత చలిగా ఉంటున్నా 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ప్రతీ ఏడాది మార్చిలో ప్రారంభం అయ్యే ఎండలు ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభమయ్యాయని ప్రజలు హడలిపోతున్నారు.



పొగమంచుతో నిండి ఉన్న ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారి

ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

తుని రూరల్: ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని, పెళ్లిళ్ల పేరుతో వారిని చదువులకు దూరం చేయడం తగదని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. మండలంలోని రాజుపేటలో శుక్రవారం సర్పంచ్ బుద్దాల సత్తిబాబు అధ్యక్షతన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను రక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసి బాలికలకు బాల్యాన్ని దూరం చేయ వద్దన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల, రక్తహీనత సమస్యలు వస్తాయన్నారు. అమ్మాయిల చదువు ఇంటికి వెలుగు నిస్తుందన్నారు. 22 సంవత్సరాలు వరకు చదివించాలని సూచించారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీటీసీ గింజాల సుబ్రహ్మణ్వేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డాది యేసుబాబు, కిల్లాడ గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంవీటీ కుమారి, బాల వెంకటేశ్వరి, లోవరాణి పాల్గొన్నారు.

ధర్మవరం సొసైటీ అధ్యక్షుడిగా 'జువ్వల'



సువ్వల బాబులు, సొసైటీ చైర్మన్, ధర్మవరం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జువ్వల బాబులు నియమితులయ్యారు. సొసైటీ త్రిసభ్య కమిటీకి చైర్మన్‌గా బాబులును నియమిస్తూ రాష్ట్ర సహకార సొసైటీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి (డీసీఓ) బీకే దుర్గాప్రసాద్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు వెంకటేశ్వరరావు (నాని), కిలాడి బాబ్జి నియమితులయ్యారు. సొసైటీ చైర్మన్‌గా నియమితులైన జువ్వల బాబులుకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, ఉప సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల చినబాబు, పార్టీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల దొరబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ పని కల్పించాలి

ఏలేశ్వరం: ఉపాధి హామీ పథకంలో అర్హులందరికీ పని కల్పించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. కూలీలకు సక్రమంగా పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.